విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు జిల్లా

ఆదివారం 24 నవంబరు, 2024. 4 పేజీలు

బాల్య వివాహం సాంఘిక దురాచారం: సిడిపీఓ

విశాలాంధ్ర-బిట్రగుంట: బాల్య వివాహం సాంఘిక దురాచారమని, చట్టరీత్యా నేరమని, కావలి ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి సౌజన్య శనివారం ముంగమూరులో అన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంలో భాగంగా ముంగమూరు 1 అంగనవాడి కేంద్రం పరిదిలోని గర్భవతులు, బాలింతలు, కిశోరీ బాలికలు, పిల్లల తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆడపిల్లలను పెంచడం భారంగా భావించి తల్లిదండ్రులే చిన్న వయస్సులో ఆడపిల్లలకు వివాహాలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. తెలిసి తెలియని వయసులో పెళ్లి చేస్తే భవిష్యత్తులో వారు ఎన్నో సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. పై కార్యక్రమంలో ఆమెతో పాటు సూపర్ వైజర్ కోటేశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు కే. లలితమ్మ, పాఠశాల ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, కార్యకర్త సునీతపాల్గొన్నారు.

డివిజన్‌లో పోలీసు స్టేషన్లను సందర్శించిన ఎస్పీ

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : కందుకూరు సబ్ డివిజన్ ఆఫీసు, కందుకూరు పట్టణం, రూరల్, ఉలవపాడు స్టేషన్‌ల పరిధిలోని కేసుల రికార్డులను జిల్లా ఎస్పీ పరిశీలించారు. పోలీసు స్టేషన్స్ మ్యాప్, చార్ట్‌ను, స్టేషన్ పరిధిలో ఉన్న పరిస్థితులు, శిధిలావస్థలో ఉన్న వాహనాలను పరిశీలించి, కోర్టు అనుమతితో వేలం వేయాలని ఆదేశాలు జారీ చేశారు. పోలీసు సిబ్బంది, అధికారుల సంక్షేమం, సమస్యలపై ఎస్పీ ఆరా తీశారు. ఎస్సీ, ఎస్టీలపై కేసులు హత్య, లైంగిక, వరకట్న వేధింపుల కేసులపై పలు సూచనలు చేసి, అలసత్వం లేకుండా దర్యాప్తు వేగవంతం చేయాలని నిందితులకు కోర్టులో కఠిన శిక్షలు పడాలని సూచించారు. హైవేపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేసి ప్రమాదాలను తగ్గించాలని సూచించారు. ప్రత్యేక బృందాలతో కోల్పోయిన ప్రాపర్టీ రికవరీపై దృష్టి సారించాలన్నారు. నేరాల నియంత్రణకు రౌడీ షీటర్స్, పాత నేరస్తులపై నిఘా ఉంచి, వారికి తప్పక కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. గ్రామాలను సందర్శించి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలన్నారు. స్కూల్స్, కళాశాలలో క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్, సైబర్ నేరాలు, చట్టాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. పోలీసు స్టేషన్ సిబ్బంది యొక్క యోగ క్షేమాలు అడిగి, ఏమైనా సమస్యలు ఉన్నాయా? వారి యొక్క గ్రీవెన్స్‌ను అడిగి, విధుల పట్ల అలసత్వం వహించవద్దన్నారు. నిబద్ధత కలిగి విధులు నిర్వర్తించాలన్నారు. ఈ సందర్భంలో జిల్లా ఎస్పీ ఎస్‌బి డిఎస్‌పి శ్రీనివాస రావు, సంబంధిత సబ్ డివిజన్ అధికారులు, ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో గ్రీన్ ఎనర్జీ రివల్యూషన్‌కు నాంది: మంత్రి ఆనం

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేయూతతో జిల్లాలో గ్రీన్ ఎనర్జీ రివల్యూషన్ కు నాంది పలకాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి కోరారు. శనివారం జెడ్పి సాధారణ సర్వసభ్య సమావేశం ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంనకు ముఖ్య అతిధిగా విచ్చేసిన మంత్రి ఆనం మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తిలో కాలాగుణంగా వస్తున్న మార్పుల్లో భాగంగా ఎటువంటి పర్యావరణ హాని కలగని సౌర విద్యుత్ నుఉత్పత్తి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి గ్రామం ఈ సౌర విద్యుత్ పథకాన్ని అందిపుచ్చుకుని స్వయం సమృద్ధి సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ విషయమై చర్యలు చేపడితే, పంచాయతీలు కరెంట్ బిల్లులకు చెల్లించే మొత్తంను ఇతర అవసరాలకు వాడుకోవచ్చునన్నారు. అదేవిధంగా ప్రభుత్వం అందించే సబ్సిడీలను ఉపయోగించుకుని ప్రతి ఇంటిలో సౌరవిద్యుత్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకుంటే వారి అవసరాలకే కాకుండా మిగులు విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించి ఆదాయం పొందే మార్గం ఉందన్నారు. ఈ విషయమై ప్రజలకు అవగాహన కలిగించేందుకు మండల స్థాయిలో వర్క్ షాప్ లను ఏర్పాటు చేయాలన్నారు. నూతనంగా నిర్మించే ప్రతి ఇంటి మౌలిక వసతుల్లో భాగంగా సౌర విద్యుత్ ప్యానల్ ఏర్పాటును కూడా భాగం చేసేలా ప్రజలకు సంపూర్ణ అవగాహన కలిగించాలన్నారు. అదేవిధంగా రాబోయే వేసవికాలంలో త్రాగునీటి సమస్యలు రాకుండా ఇప్పటి నుండే చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు వారి సమస్యలను ఎలుగెత్తి చాటి పరిష్కారం పొందే అపూర్వ అవకాశం జెడ్పి సర్వసభ్య సమావేశమని,దానిని ఉపయోగించు కోవాలన్నారు.అదేవిధంగా గ్రామీణ భారతాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ ప్రణాళికలు రూపొందిస్తున్నాయన్నారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలో తాగునీటి సమస్యలు అధికంగా ఉన్నాయని, జల్ జీవన్ మిషన్ ద్వారా కేంద్రం నుండి వచ్చే ప్రతి పైసా ను సద్వినియోగం చేసుకుని ఇంటింటికి కుళాయి ద్వారా త్రాగునీటిని అందించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాను ప్రగతి పథంలో నడిపేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని, స్థానిక ప్రజా ప్రతినిధులు రాజకీయాల కతీతంగా కలసి రావాలని కోరారు. అభివృద్ధికి రాజకీయాలు ఆటంకం కాకూడదని,అందరి భాగస్వామ్యంతో జిల్లా ను అభివృద్ధి చేసుకుందామన్నారు. స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరించేందుకు మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను నిర్వహిస్తున్నామన్నారు. అలాగే మండల సర్వ సభ్య సమావేశాలకు వివిధ శాఖల మండల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని లేనిచో క్రమ శిక్షణ చర్యలు తప్పవన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే

2

అయ్యా!.. బిడ్డ వైద్యానికి సాయం చేయండయ్యా!..

ఐదువేలు లేక వైద్యం చేపించకపోవడంతో మంచానికే పరిమితమైన “విధి” వంచితుడు!..

దాతల సాయం కోసం తల్లిదండ్రులు ఎదురుచూపు!.. ఆ బిడ్డకు శాపంగా మారిన పేదరికం!..

విశాలాంధ్ర- కావలి రూరల్: ముక్కుపచ్చలారని ఆ బిడ్డకు తోటి పిల్లలతో సరదాగా గడపాల్సిన బాల్యం అంటే ఏంటో తెలియదు. గొంతు లేయాల్సిన బాల్యం మంచానికే పరిమితమైంది. తోటి పిల్లలతో బుడిబుడి అడుగులేస్తూ ఆనందంగా గడపాల్సిన బాల్యం తాలూకు మధుర స్మృతులు ఆ విధి వంచితుడుకు తెలియవు. జన్మనిచ్చిన అమ్మ నాన్నలను గుర్తుపట్టలేడు.. కన్న తల్లిదండ్రులు ఆ బిడ్డపై పెట్టుకున్న ఆశలు ఆవిరైనాయి. పుట్టేడు దుఃఖంతో ఆ తల్లిదండ్రులు బిడ్డ దీన పరిస్థితిని చూసి తల్లటిల్లడం తప్ప చేసేది ఏమి లేక బోరుణ విలపిస్తున్నారు. రెక్కడితే గాని డొక్కాడని ఆ నిరుపేద తల్లిదండ్రులకు వైద్యం చేపించే స్తోమత లేక ముంచానికే పరిమితం చేసి ఆ బిడ్డ భవిష్యత్తును చేతులారా కాజేశారు. మంచానికే పరిమితమై నిండు జీవితాన్ని మంచంతో స్నేహం చేస్తూ ఆ విధి వంచితుడుగా బ్రతుకు జీవనం సాగిస్తున్న ఆ బిడ్డను చూస్తూ పుట్టెడు దుఃఖంతో తల్లడిల్లుతున్న ఆ తల్లిదండ్రుల కన్నీటి వ్యథపై విశాలాంధ్ర ప్రత్యేక కథనం!. ఈ హృదయ విదారక సంఘటన కావలి పట్టణంలోని కావేరి గుంట గిరిజన కాలనీలో చోటుచేసుకుంది. వివరాలు మేరకు కావలి పట్నం లోని కావేరి గుంట గిరిజన కాలనీలో మకాని కామేశ్వరి మాల్యాద్రి పేద దంపతులు జీవిస్తున్నారు. వారికి లేక లేక పండంటి బిడ్డ జన్మించాడు. ఆ బిడ్డకు మా కాని శివయ్య అని పేరు పెట్టుకున్నారు. ఆ బిడ్డకు మంచి చదువులు చదివించాలని కలలు కన్నారు. కూలి పని చేసుకుని వచ్చిన డబ్బులతోనే ఆ కుటుంబం సంతోషంగా జీవిస్తున్నారు. సంతోషంగా జీవిస్తున్న ఆ దంపతులను చూసి కాలం కన్నెర్ర చేసింది. ఆ బిడ్డకు తొమ్మిదో సంవత్సరం రాగానే ఫిట్స్ రూపంలో ఆ బిడ్డను కబలించింది. వైద్యం చేపించాలంటే 5000 ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పటంతో వైద్యం చేపించే స్తోమత లేక ఆ బిడ్డను అలా వదిలేశారు. రెండు కాళ్లు రెండు చేతులు నోటిమాట లేకుండా ఆ బిడ్డను కబలించిన ఆ పీట్స్ మంచానికి పరిమితం చేసింది. నిండు నూరేళ్లు సంతోషంగా గడపాల్సిన బాల్యం జీవశవంలా మంచానికే పరిమితమై ఆ తల్లితండ్రుల గర్భ శోకానికి ఆ దేవుడు పురోక్షంగా కారణమయ్యాడు. చివరకు నవ మాసాలు మోసి కన్న తల్లికి పుట్టుడు దుఃఖమే దేవుడు మిగిల్చాడు. ఎన్నో నోములు నోచి పండంటి కలలతో పూరుడు పోసుకున్న ఆ తల్లికి పండంటి మగ బిడ్డ పుట్టాడని సంబరపడింది. ఊరు వాడ అంతా చెప్పుకొని మురిసిపోయింది. నా బిడ్డ కలెక్టర్ అవుతాడని ఆ కాలనీ వాసు లందరికీ చెప్పుకొని తెగ సంబరపడింది. ఇలా కన్న ఆశలన్నీ పాలపై నురుగుల పొంగి పేక మేడల కూలిపోయాయి. తేరుకునే లోపే ఆ బిడ్డ విధి వంచితుడు అని తెలియగానే పుట్టెడు శోకంతో ఆ తల్లిదండ్రులు తల్లడిల్లి పోయారు. ఆ బిడ్డకు వైద్యం చేపించుకోవడానికి దాతల సాయం కోసం ఆ తల్లిదండ్రులు జోలిపట్టి వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. మనసున్న దాతల్లారా ఒక్క క్షణం ఆలోచించండి.. ఎంతో భవిష్యత్తు ఉన్న ఆ బిడ్డ మంచానికి పరిమితమై జీవన పోరాటం చేస్తున్నాడు. మనసున్న దాతల్లారా తల చెయ్యేస్తే ఆ బిడ్డకు బంగారు భవిష్యత్తు ఇచ్చిన వారమవుతాం.

18సంవత్సరాలు నిండిన ఆడపిల్లలకు వివాహాలు చేయాలి

విశాలాంధ్ర-వలేటివారిపాలెం: 18సంవత్సరాలు పూర్తయిన తర్వాత మాత్రమే ఆడపిల్లలకు వివాహాలు చేయాలని అంగన్వాడీ సూపర్వైజర్ సునీత పేర్కొన్నారు. శనివారం కందుకూరు ప్రాజెక్ట్ పరిధిలో ని వలేటివారిపాలెం 2సెక్టార్‌లో కొండసముద్రం గ్రామంలో సీడీపీఓ శారద సూచనల మేరకు సూపర్వైజర్ సునీత ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహనా సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18సంవత్సరాలు పూర్తయిన తర్వాత వివాహం చేసినట్లయితే వారిలో శారీరకంగా, మానసికంగా ఎదుగుదల ఉంటుందన్నారు. 18సంవత్సరాలలోపు వివాహం చేయకూడదని తక్కువ వయస్సులో వివాహం చేయడం వలన అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయని అన్నారు. కిశోర బాలికలు కూడా సరైన అవగాహన కలిగివుండాలని మోసపూరితమైన మాటలను వినకూడదాన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పౌష్టికాహారం తీసుకోవాలి అని తెలియజేశారు. ఆడపిల్లలు బడి మాని వేయడాన్ని పూర్తిగా అరికట్టాలని అందరూ బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు ఈరోజు కార్యక్రమంలో స్కూల్ హె ఎం. కె.పాల్ జాన్సన్, ఉపాధ్యాయులు కె.రవికుమార్, ఎస్ కె.రేష్మ అంగన్వాడీ కార్యకర్తలు శిరోమణి, శిరీష ఆయా పద్మ, నయోమి పాల్గొన్నారు

రామచంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించిన పాపకన్ను

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మండల వైయస ఆర్సీపీ సీనియర్ నాయకులు బిట్టు 2- ఎంపీటీసీ రేవూరు రామచంద్రయ్య సోమవారం మృతి చెందడంతో రాపూరు మండల వైయస్సార్సీపి సీనియర్ నాయకులు మాజీ మార్కెటింగ్ చైర్మన్ పాపకన్ను మధుసూదన్ రెడ్డి శనివారం రామచంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించి మీకు అండగా మె మున్నామని, అధైర్యపడవద్దు అని భరోసా ఇచ్చారు. వీరి తోపాటు దందోలు నారాయణ రెడ్డి, ఎంపీటీసీ పెంచల్ రెడ్డి, దుగ్గిరెడ్డి నరసింహా రెడ్డి, మధుసూదన్ రెడ్డి, డాక్టర్ ఖాద ర్ భాషా నలవడ్ల గణేష్ రెడ్డి, చిరంజీవి, మేరిగా శంకర్ పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో

విశాలాంధ్ర- కావలి రూరల్: కావలి మండలం రుద్రుకోట గ్రామంలో ఉన్న మండల ప్రజా పరిషత్ పాఠశాలను శనివారం కావలి మండల అభివృద్ధి అధికారి సిహెచ్ శ్రీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ పాఠశాలలో విద్యార్థులకు అందు తున్న భోజనాన్ని పరిశీలించారు. స్వయంగా ఆమె భోజనాన్ని తిని భోజనం నాణ్యతను పరిశీలించారు. ఆ పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఆరాదీశారు. వంటగదిని పరిశీలించి అక్కడ కట్టెలతో భోజనం ఉండటంతో వంట గది అంతా అపరశుభ్రంగా ఉండంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి గ్యాస్ కనెక్షన్ ఏర్పాటు చేస్తే విద్యార్థులకు నిర్ణీత సమయానికి భోజనం తయారు చేయడమే కాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు భోజన విషయంలో ఎక్కడ రాజీ లేకుండా నాణ్యమైన భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకంలో ఏమైనా లోపాలు కనిపిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటానని ఉపాధ్యాయులను కావలి ఎంపీడీవో సిహెచ్ శ్రీదేవి హెచ్చరించారు.

మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ హుండీ లెక్కింపు



విశాలాంధ్ర-వలేటివారిపాలెం: వలేటివారిపాలెం మండలంలోని అయ్యవారిపల్లి పంచాయతీ లో కొలువుదీరి ఉన్న మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంను దర్శించుకొనుటకు రాష్ట్రం నలుమూలలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కలు తీర్చుకొన్నారు. ఈ శనివారం భక్తుల ద్వారా వివిధ రూపా లలో దేవస్థానం నకు వచ్చిన ఆదాయం 9,96,628రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఉపకమిషనర్, ఆలయ కార్యనిర్వాహనాదికారి. కె. వి.సాగర్ బాబు తెలిపారు. మొత్తం 9,96,628 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఉపకమీషనర్, ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.వి.సాగర్ బాబు తెలిపారు.

జిల్లాలో గ్రీన్ ఎనర్జీ రివల్యూషన్‌కు నాంది

(మొదటి పేజి తరువాయి) నెల్లూరు రూరల్ పరిధిలోని కొమ్మరపూడి గ్రామంలో మంజూరైన ఎత్తిపోతల పథకాలను కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయకుండా అసంపూర్తిగా నిలిపారని శ్రీధర్ రెడ్డి అన్నారు. కొమ్మరపూడి గ్రామంలో ఎత్తిపోతల పథకాలు చాలా అవసరమని అలాంటి పనులను కాంట్రాక్టర్లు నిలుపదల చేశారని వారిని బ్లాక్ లిస్టులో పెట్టి కొత్త కాంట్రాక్టర్ల ద్వారా పనులు చేపట్టాలని ఆయన కోరారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్ కార్పొరేషన్ సంస్థ అధికారులు సమావేశాలకు రాకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కావలి ఎంఎల్ఎ కావ్యకృష్ణారెడ్డి మాట్లాడుతూ కావలి నియోజకవర్గం అల్లూరు గ్రామంలో త్రాగునీటి పథకాలు మరమ్మతుల గురై అక్కడి ప్రజలు ఎర్రటి నీళ్లను తాగుతున్నారని దానివల్ల చాలా ఇబ్బందులు గురవుతున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. నియోజకవర్గంలో తాగునీటి పథకాలు శిథిలావస్థకు చేరాయని అవి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని అక్కడ పిల్లలు ఆడుకుంటూ ప్రమాదాలు గురయ్యే అవకాశం ఉందని వాటిని తొలగించ వలసిందిగా ఆయన కోరారు. జిల్లా పరిషత్ నిధులనుండి,15 ఆర్థిక సంఘం నిధుల నుండి త్రాగునీటి పథకాలను పరమత్తులను చేపట్టాలని ఆయన కోరారు. సోలార్ పవర్ వినియోగంపై పూర్తిస్థాయిలోప్రజలకు అవగాహన కల్పించాలనిఅన్నారు . ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో శాశ్వతంగా త్రాగునీటి సమస్య పరిష్కరించడానికి సోమశిల నీరు వస్తే గాని పరిష్కారం కాదని ఆయన అన్నారు జలజీవన్ మిషన్ క్రింద ప్రతి ఇంటికి త్రాగునీరు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. ఉదయగిరి నియోజక వర్గంలోని 8 మండలాలలో2014-5సంవత్సరాలలో ఎన్టీఆర్ సుజల స్రవంతి క్రింద త్రాగునీటి ప్లాంట్స్ ప్రారంభించడం జరిగిందని ఆయన అన్నారు. త్రాగునీటి ఆర్.ఓ ప్లాంట్ లు మరమ్మత్తుల గురయ్యాయని గతంలో పట్టించుకోలేదని వాటిని మరమ్మతులు చేయడానికి నిధులు మంజూరు చేయవలసిందిగా ఆయన కోరారు. ఇరిగేషన్ ట్యాంక్ ల క్రింద ఉన్న సబ్ ఛానల్స్ మరమ్మత్తులు చేయడానికిడిపిఆర్ ప్రతిపాదన తయారు చేయాల్సిందిగా ఆయన కోరారు. అలాగే నక్కలగండి వాగుకు మరమ్మత్తులకు ప్రతిపాదనలు తయారు చేయవల సిందిగా ఆయన చెప్పారు. ఉదయగిరి నియోజకవర్గం పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్ల కొరత లేకుండా భర్తీ చేయాలని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. కొండాపూర్ మండలంలో నాలుగు గ్రామాల్లో రెండవ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. జడ్పిటిసిలకు 21నెలల గౌరవ వేతనం ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. వెంకటగిరి ఎంఎల్ఎ కురుకుంట్ల రామకృష్ణ మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గంలో రైతులు ఎత్తిపోతల పథకాల మీద ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారన్నారు. ఇలాంటి సమావేశానికి ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులు హాజరు కాకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చాలాకాలంగా పెండింగ్ లో ఉన్న రైల్వే ప్రాజెక్టును పట్టాలెక్కించడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. రైల్వే శాఖ వారు నిర్వహించే గ్రామసభలకు రెవిన్యూ అధికారులు కూడా హాజరయ్యే విధంగాచర్యలు చేపడతామన్నారు. రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని అయితే భూసేకరణ విషయంలో ఇప్పటికే నిర్ణయించిన ధరను మార్చే అధికారం జిల్లా స్థాయిలో లేదని రైతులు గుర్తించాలన్నారు. అలాగే సభ్యులు లేవనెత్తిన ఇరిగేషన్ సమస్యలను పరిషరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి. మాట్లాడుతూ నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని జాఫర్ సాహెబ్ కెనాల్, మైపాడు రోడ్డు విస్తరణల మీద ఆక్రమణలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని గత ప్రభుత్వంలో మైపాడు రోడ్డు జాఫర్ సాహెబ్ కెనాల్ ప్రాంతంలో 80 అడుగుల రోడ్డు,కెనాల్ రివిట్మెంట్, వాకింగ్ ట్రాక్ బ్యూటిఫికేషన్ పనులు చేపట్టారని తెలిపారు. అయితే రివిట్ మెంట్ వర్క్, వాకింగ్ ట్రాక్ నిర్మాణాలు ఇంకా పెండింగ్ దశలో ఉన్నాయని రివిట్మెంట్ పెండింగ్ పనులను ఇరిగేషన్ అధికారులు ఎప్పుడులోగా ఈ సమావేశంలో శాసన మండలి సభ్యులు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, మేరిగ మురళీ,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పేద మహిళకు జీవనోపాధి కల్పించిన ఏఎస్ఐ

విశాలాంధ్ర -కావలి: ఈరోజు కావలి పట్టణం నివాసులు ప్రస్తుతం గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మార్టూరి పరమేశ్వరి వారి తల్లిదండ్రులైన మార్టూరి. మాలకొండయ్య - సరోజనమ్మలి దంపతుల గార్ల జ్ఞాపకార్థంగా కావలి పట్టణం జంగాల కాలనీలోని నేలపనేని.అంకమ్మ అనే నిరుపేద మహిళకు జీవనోపాధి నిమిత్తం బట్టల వ్యాపారం పెట్టించడం జరిగిందిలి.అనంతరం సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ ద్వారా చదువుకుంటున్న పేద విద్యార్థులకు అన్నదానం చేసి విద్యార్థులందరితో కలసి సంతోషంగా వారి భోజనం తినడం జరిగింది. ఈ కార్యక్రమంలో దాత ఏఎస్ఐ మార్టూరి. పరమేశ్వరి వారి అక్క పద్మ,సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ నేటి దాత ఏ ఎస్ ఐ పరమేశ్వరి గారు గత 5 సంవత్సరాల క్రితం సంయుక్త సేవా సంస్థ సభ్యులుగా చేరి సంస్థ ద్వారా పేదలకు సేవలందిస్తూ ఉన్నారని తెలిపారు. ఎవరైనా ఆపదలో ఉన్నారని తెలిపిన వెంటనే స్పందించి బాధితులకు సహాయం చేయడంలో ముందుంటారని తెలిపారు. గతంలో కూడా వారి తల్లి దండ్రుల పేరు మీద ఒక నిరుపేద మహిళకు కుట్టు మిషను ఇచ్చి స్వయం జీవనోపాధిని కల్పించారని తెలిపారు. నేడు మరో పేద మహిళైన అంకమ్మకు స్వయం ఉపాధి నిమిత్తం బట్టల వ్యాపారం పెట్టించడం జరిగిందని తెలిపారు. అంకమ్మ భర్త ఇటీవల క్యాన్సర్ వ్యాధితో మరణించారని, కష్టకాలంలో ఉన్న వారికి జీవనోపాధిని కల్పించి ఆ కుటుంబానికి అండగా నిలిచారని అన్నారు. అలాగే సంయుక్త సేవా సంస్థ ద్వారా చదువుతున్న పేద విద్యార్థులకు అన్నదానం చేసి పిల్లలతో కలిసి వారు కూడా భోజనం తినడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ పరమేశ్వరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు. వారి తల్లిదండ్రులు మార్టూరి.మాలకొండయ్య - సరోజనమ్మ దంపతుల గార్ల పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతున్ని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ ఉన్నామన్నారు.

HINDUJA LEYLAND FINANCE

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీస్ : 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట్, చెన్నై-600 015, తమిళనాడు, ఇండియా. www.hindujahousingfinanace.com

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధనలు 9(5), మరియు 9(1) కింద రుణగ్రహీతకు స్థిర ఆస్తి అమ్మకపు నోటీసు

తేదీ: 23-11-2024

టు,

1.శ్రీ పలగాల రవీంద్ర (రుణగ్రహీత) 2.శ్రీమతి పలగాల సుష్మిత (సహ-రుణగ్రహీత)

ఆర్/ఓ. డోర్ నెం:- 1-66, కొక్కుపాడు, కోట, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్-524411.

విషయం: సర్ఫేశీ చట్టం, 2002 కింద హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ ద్వారా హామీగా పెట్టిన ఆస్తి విక్రయం

రిఫరెన్స్: రుణ ఖాతా నం. AP/NLR/VERN/A000000267 & CO/CPC/CPOF/A000000433

డియర్ మేడమ్(లు)/ సర్(లు),

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 (ఇకమీదట సెక్యూరిటైజేషన్ చట్టం చదివేది) కింద రూపొందించబడిన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనల యొక్క రూల్ 2(ఎ) ప్రకారం 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట్, చెన్నై - 600 015, తమిళనాడు, ఇండియా వద్ద కార్పొరేట్ కార్యాలయం మరియు 54-20-10/1ఎ, ప్లాట్ నెం: 43, 3వ అంతస్తు, ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా, మెయిన్ రోడ్, గురునానక్ కాలనీ, విజయవాడ, పిన్- 520 008 నందు బ్రాంచ్ కార్యాలయం కలిగియున్న ఎం/ఎస్. హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇకపై సెక్యూర్డ్ క్రెడిటార్‌గా పేర్కొనేది) అధీకృత అధికారిగా నేను సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు,2002 యొక్క నియమాలు 8(5) మరియు 9(1) ప్రకారం మీకు ఈ నోటీసును జారీ చేడమైనది. అదే క్రింది విధంగా ఉంది:-

1.సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 (సర్ఫేశీ చట్టం) మరియు దాని కింద రూపొందించబడిన నిబంధనల కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి

మీకు పంపిన నోటీసులో ప్రస్తావించిన విధంగా స్థిర ఆస్తి(హామీగాపెట్టిన ఆస్తి)కి సంబంధించి సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సర్ఫేశీ చట్టం) మరియు దాని కింద పొందుపరచిన నిబంధనల కింద సెక్యూర్డ్ క్రెడిటార్స్‌కు సంక్రమించిన అధికారాలను వినియోగించి **హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్‌హెచ్ఎఫ్ఎల్)** ద్వారా తేదీ: **20-04-2024**న రోజువారీ వార్తాపత్రికలు అంటే 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ & ప్రజాశక్తి'లో ప్రచురించిన జారీ చేసిన **16-04-2024** నాటి స్వాధీనత నోటీసును మరియు హామీగా పెట్టిన ఆస్తి వద్ద స్పష్టమైన ప్రదేశంలో అతికించిన నోటీసు ను దయచేసి చదువగలరు.

2. ఈ రోజు వరకు, మీరు మీ బకాయిలను పూర్తిగా హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ కి చెల్లింపు చేయనందున సర్ఫేశీ చట్టం మరియు దానికింద రూపొందించిన నిబంధనల ప్రకారం హామీగా పెట్టిన ఆస్తిలో దిగువ పేర్కొన్న భాగాన్ని విక్రయించాలని హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ ప్రతిపాదిస్తోంది. హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ హామీగాపెట్టిన ఆస్తిని బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని భావిస్తోంది. హామీగా పెట్టిన ఆస్తి అత్యధిక బిడ్/కొనుగోలు ధరను అందించే ఉద్దేశిత కొనుగోలుదారులలో ఒకరికి విక్రయించబడుతుంది. ఇది " నిర్ణయించిన రిజర్వ్ ధర **రూ.13,00,000/- (పదమూడు లక్షల రూపాయలు మాత్రమే)** కంటే తక్కువగా ఉండదు.

సీలువేసినబిడ్/ఆఫర్‌ను సమర్పించడానికి చివరి తేదీ: 11-12-2024 మరియు వేలం తేదీ: **12-12-2024.**

వేలం నోటీసు తేదీ: **24-11-2024**న రెండు రోజువారీ వార్తాపత్రికలలో అంటే వరుసగా 'ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్' మరియు 'విశాలాంధ్ర'లో ప్రచురించబడింది.

3. మీరు పొందిన రుణానికి సంబంధించి రుణ ఒప్పందం మరియు ఇతర పత్రాలలో పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం **19-11-2024 నాటికి రూ.27,90,424/- (ఇరవై ఏడు లక్షల తొంభైవేల నాలుగు వందల ఇరవైనాలుగు రూపాయలు మాత్రమే)** లను తదుపరి వడ్డీ పీనల్ వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలతో కలిపి ఈ నోటీసు వచ్చిన 15 రోజులలోపు చెల్లించడంలో విఫలమయినట్లయితే ఈ క్రింద పేర్కొన్న హామీగా పెట్టిన ఆస్తి వేలం/ప్రైవేట్ ఒప్పందంలో విక్రయించబడుతుందని మేము మీకు నోటీసు ఇవ్వడమైనది. ఇంతకుముందు కూడా వేలం నిర్వహించబడినప్పటికీ రిజర్వ్ ధరకు సమానమైన బిడ్ రాలేదు. నిర్ణీత గడువులోగా మీరు మొత్తం బకాయిలను చెల్లించనట్లయితే మీకు తదుపరి ఎలాంటి నోటీసు ఇవ్వబడదు మరియు దిగువ పేర్కొన్న హామీగాపెట్టిన ఆస్తి ప్రైవేట్ ఒప్పందం ద్వారా విక్రయించబడుతుంది. హామీగాపెట్టిన ఆస్తి విక్రయించగా వచ్చిన ఆదాయాన్ని సర్దుబాటు చేసిన తర్వాత హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ కి మీరు చెల్లించాల్సిన రుణం మొత్తంలో ఏదైనా మిగిలి ఉంటే... అది మీ నుండి వసూలు చేయబడుతుందని గమనించగలరు.

స్థిర ఆస్తి యొక్క వివరాలు (హామీగా పెట్టిన ఆస్తి) :

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్ జిల్లా, కోట సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, కోట మండలం, కొక్కుపాడు పంచాయతీ, కోట బిట్-1, కోట మజారా, కొక్కుపాడు గ్రామం, సర్వే నం. 531-ఎ నందు డోర్ నంబరు, వార్డ్ నంబరు లేని సిమెంట్ శ్లాబ్ పైకప్పు ఇల్లుతో పాటు 35.48 అంకణములు లేదా 283.84 చదరపు గజాలు స్థలం. హద్దులు: తూర్పు: రోడ్డు, పడమర: నెల్లూరు మోహన్ రెడ్డి ఇల్లు, ఉత్తరం: ఎగ్జిక్యూటెంట్ యొక్క స్థలం, దక్షిణం: పాలగాటి శ్రీనివాసులు రెడ్డి ఇల్లు, ఈ సరిహద్దుల పరిధిలో 35.48 అంకణములు లేదా 283.84 చదరపు గజాలు స్థలం. ఇందులో అన్ని అనుభవ హక్కులతో సహా 1073 చదరపు అడుగుల విస్తీర్ణంలో సిమెంట్ శ్లాబ్ పైకప్పు ఇల్లు. అసెస్‌మెంట్ నం.28, కరెంట్ సర్వీస్ నం.23,

మీ విశ్వాసపాత్రుడు,

హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరఫున

(అధీకృత అధికారి)

శ్రీ భగవాన్ వెంకట స్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర –మనుబోలు: మనుబోలు చెర్లోపల్లి రైల్వే గేట్ సమీపాన వెలసి ఉన్న శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి వారి దేవస్థానంలో శనివారం సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నూతన పట్టు వస్త్రాల సమర్పణ విశేషమైన దుని పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయ దాతలుగా మనుబోలు మోహన్ రెడ్డి పద్మలు వ్యవహరించారు. అర్చకులు శ్రీనివాసులు పూజలను నిర్వహించి భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అంగన్వాడి కేంద్రంలో బాల్యవివాహాలపై అవగాహన

విశాలాంధ్ర–రాపూరు: రాపూరు మండలంలోని రాపూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని రాపూరు మండలం గోనుపల్లి సెక్టార్ పరిధిలోని పెంచలకోన లోని ఎస్టీ కాలని అంగన్వాడి కేంద్రంలో సూపర్వైజర్ రాజ్యలక్ష్మి తల్లులకు, కిశోరి బాలికలకు బాల్య వివాహలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆడపిల్లలకు 18సంవత్సరాలు పూర్తయిన తర్వాత వివాహాలు చేయాలని అంగన్వాడీ సూపర్వైజర్ రాజ్యలక్ష్మి తెలియజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్స రాలు పూర్తయిన తర్వాత వివాహం చేసినట్లయితే వారిలో శారీరకంగా, మానసికంగా ఎదుగుదల ఉంటుందన్నారు. తక్కువ వయస్సులో వివాహం చేయడం వలన అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడు తాయని అన్నారు. కిశోర బాలికలు కూడా సరైన అవగాహన కలిగి వుండాలని మోసపూరితమైన మాటలను వినకూడదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పౌష్టికాహారం తీసుకోవాలి అని, ఆడపిల్లలు బడి మాని వేయడాన్ని పూర్తిగా అరికట్టాలని అందరూ బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రంలో అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

నేటితో సర్వే పూర్తికి కృషి

విశాలాంధ్ర –మనుబోలు: జిల్లా కలెక్టర్ ఆదేశాలతో శనివారం సాయంత్రానికి మనుబోలు మండలంలో సమగ్ర ఇంటింటి గృహ సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నట్లు మనుబోలు ఎంపీడీవో జలజాక్షి తెలిపారు. శనివారం మనుబోలు గ్రామంలో జరుగుతున్న సర్వే కార్యక్రమంలో స్వయంగా ఎంపీడీవో పాల్గొన్నారు.ఆమె మీడియాతో మాట్లాడుతూ మండలంలో మొత్తం 2059 గృహాలను సర్వే చేయాల్సి ఉండగా శనివారం ఉదయం వరకు 60 శాతం పూర్తి చేసామని సాయంత్రానికి నూరు శాతం సర్వే పూర్తిచేసేలా త్వరితగతంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మనుబోలు పంచాయతీ కార్యదర్శి గరుడయ్య, శ్రావ్య,సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ

విశాలాంధ్ర–ఉదయగిరి: మండల పరిధిలోని సంజీవరాజు పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు స్థానిక మండల విద్యాధికారి తోట శ్రీనివాసులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు తనిఖీల్లో భాగంగా పాఠశాలలోని అన్ని తరగతుల విద్యార్థినీ విద్యార్థుల పఠన అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు తెలిసిన విషయాల నుంచి తెలియని విషయాలకు పరిసరాలను పరిచయం చేస్తూ బోధించాలని విద్యా ర్థులకు గుణాత్మకమైన బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు విద్యా ర్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు పాఠశాలలోని అన్ని రికార్డులు పరిశీలించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట యజ్ఞ తదితరులు పాల్గొన్నారు

సాంఘిక కార్యక్రమాల నుండి యువతను కాపాడండి: జనసేన

విశాలాంధ్ర బ్యూరో–నెల్లూరు: ఎస్ టు సినిమా థియేటర్ నుంచి విజయమహల్ గేటు వరకు జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను అరికట్టండి తెలిసీ తెలియక న్యూడ్ కాల్ ఉచ్చు లో పడిన యువత బెదిరింపులు కాల్స్‌పై నేరుగా పోలీసులను సంప్రదించే టట్లు అవేర్నెస్ ప్రోగ్రాం అరేంజ్ చేయాలి అని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల శనివారంఅడిషనల్ ఎస్పీని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా కిషోర్ మాట్లాడుతూ యువతను ఉద్రేక పరుస్తూ అనేక యాప్స్,న్యూడ్ కాల్స్ ద్వారా వాళ్ళ నగ్నవీడియో రికార్డు చేసిబెదిరించి వారికి పరిచయం ఉన్న వ్యక్తులకు ఆ వీడియోలను పంపించి బెదిరింపుల వల్ల యువత దిక్కుతోచని పరిస్థితుల్లో ఇంటా బయట దొరికిన డబ్బు,నగలు అమ్మి వారికి ముట్ట చెబుతున్నారు. ఎంత డబ్బు ఇచ్చినప్పటికీ వారు మరింత డబ్బులు కావాలని ఒత్తిడి చేయడంతో చేయాల్సిన తప్పుడు పనులన్నీ చేసి చివరకు ఆత్మహత్య తో ప్రాణాలు తీసుకునేదాకా వెళుతున్న యువతను కాపాడాల్సిన అవసరం ఉంది అని అడిషనల్ ఎస్పీకి తెలియజేశామన్నారు అలాగే అసాంఘీక అప్స్,న్యూడ్ కాల్స్ నిషేధించాలని సన్మార్గంలో యువత నడిపిం చేందుకు కౌన్సిలింగ్ వీడియోలను కౌన్సిలింగ్ సమావేశాలను ఏర్పాటు చేస్తే మంచిదని తెలిపారు. వీటిపైన సమగ్ర వివరణ తో రిపోర్ట్ కూడా ఇస్తామనితెలిపారు.అదేవిధంగా నెల్లూరు నగరంలోఎస్2 సినిమా హాల్స్ నుంచి విజయ మహల్ గేటు వద్ద వరకు జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలకు వలన యువత పాడవుతుంది,వాటి గురించి కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. దీనిపై అడిషనల్ ఎస్పీ స్పందిస్తూ గతంలో మీరు ఇచ్చిన గంజాయి కేసుకు సంబంధించిన కూడా ఒక సర్వే నిర్వహించి కట్టడి చేస్తున్నామని వీటి గురించికూడా సమగ్ర సమాచారం అందజేస్తే కచ్చితంగా అసాంఘిక కార్యక్రమాలపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

అంగన్వాడి సెంటర్‌ను పరిశీలించిన సూపర్‌వైజర్

విశాలాంధ్ర–కావలి రూరల్: కావలి మండలం రుద్రుకోట పంచాయతీలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని శనివారం క్లస్టర్ సూపర్వైజర్ కృపమ్మ పరిశీలించారు. ఆ అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అందుతున్న భోజన సదుపాయాన్ని పరిశీలించారు. అంగన్వాడి కేంద్రంలో పదిమంది చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారాన్ని గురించి ఆరా తీశారు. అంతే కాకుండా హాజరు పట్టికను పరిశీలించారు. ఆ కేంద్రంలో చిన్నారులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్న అంగన్వాడి కార్యకర్తను అభినందించారు. ఈ విజిట్ లో అంగన్వాడి కేంద్రం కార్యకర్త ఎం రాజేశ్వరి, ఆయా జి వెంకట రమణమ్మ, చిన్నారులు ఉన్నారు.

మొక్కలు నాటిన ఎన్‌సిసి క్యాడేట్స్

విశాలాంధ్ర –కావలి: కావలి, పాత ఊరు నందుగల పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలోని ఎన్సిసి యూనిట్ ఆధ్వర్యంలో ఎన్సిసి డే వారోత్సవాల సందర్భముగా రాజీవ్ నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునందు ఎన్సిసి క్యాడెట్స్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ మేఘనాథ్ చౌదరి ఎన్సిసి క్యాడెట్స్ ను ఉద్దేశించి మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగమైనందుకు ప్రతి ఒక్కరిని అభినందిస్తున్నానని ఒక్కొక్కరు ఒక్కొక్క మొక్కను నాటి దానిని కాపాడవలసిన బాధ్యత తీసుకోవాలని తెలియ జేశారు .పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు మాట్లాడుతూ విరివిగా వాహనాల వాడకం వలన కాలుష్యం పెరిగిపోతుందని, ఈ విధంగా మొక్కలు నాటి పెంచడం వలన కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చని, వర్షాలు కూడా కొద్దిగా సమృద్ధిగా కురుస్తాయని, గాలిలో ఆక్సిజన్ స్థాయిని కూడా పెంచుకోవచ్చని తద్వారా మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలియ జేశారు. ఈ కార్యక్రమములో ఉపాధ్యాయులు మధుసూదన్, సుజాత ,ఎన్సిసి అధికారి మస్తాన్ వలి మరియు ఎన్సిసి క్యాడెట్స్ పాల్గొన్నారు.

జనసేన పార్టీలో చేరిక

విశాలాంధ్ర –కావలి: కావలి నియోజకవర్గం, ఆముదాలదిన్నె వైసీపీ నాయకుడు, పంచాయితీ మెంబర్ బలగాని కళ్యాణ్ ఈ రోజు కావలి జనసేన పార్టీ కార్యాల యములో ఇంచార్జ్ అళహరి సుధాకర్ చేతులమీదుగా కండువా కప్పించుకుని జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అళహరి సుధాకర్ మాట్లాడుతూ కళ్యాణ్ మా జనసేన పార్టీ అధ్యక్షులు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వీరాభిమాని అని 2019 ఎలెక్షన్స్ లో జనసేన పార్టీ కోసం కష్టబడి పనిచేసిన వ్యక్తి అని అన్నారు. జనసేన పార్టీ కండువా కప్పించుకొని తన సొంత ఇళ్లు అయిన జనసేన పార్టీ లోకి చేరారు అని తెలిపారు. ఈ కార్యక్రమములో కావలి రూరల్ అధ్యక్షుడు గుడిపల్లి వెంకయ్య పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర–జలదంకి: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న ఏపీ రైతు సంఘం పిలుపుమేరకు కావలిలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు రావి మాల్యాద్రి పిలుపునిచ్చారు. శనివారం జలదంకి లోని స్థానిక సూర్య చెంచు రెడ్డి భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రైతన్నలు పండించిన పంటలకు సరైన మద్దతు ధర ప్రకటించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, పంటలకు సోకుతున్న చీడపీడలతో పంటలు నష్టపోయి, రైతన్నలు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే,కేంద్ర ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. కేరళ తరహాలో దేశంలోని అన్ని రాష్ట్రాలలో రైతన్నలకు ఉపశమన పథకాన్ని ప్రవేశపెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి మాల్యాద్రి, అంతోని బాబు, రాధాకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రెడ్డి పలువురికి ఆదర్శప్రాయుడు

విశాలాంధ్ర –కావలి : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కావలి పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు ముగింపు సందర్భంగా మాలకొండ రెడ్డిని ఎంపీడీవో శ్రీదేవి చేతుల మీదుగా సత్కరించారు. శ్రీదేవి మాట్లాడుతూ సంఘీ సేవ చేస్తూ అనేక ప్రాంతాల్లో సేవలందించి వచ్చిరని తెలిపినారు. ముఖ్యంగా వారిని భారత ప్రభుత్వం గతంలో ఉత్తర భారత విజ్ఞాన యాత్రకు ఉత్తరప్రదేశ్ ఉత్తరాంచల్ పంజాబ్ హర్యానా పంజాబ్ రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి సంస్కృతి ప్రాజెక్టులు తదితర ప్రాంతాలను సందర్శించడానికి తీసుకెళ్ళినారు. అలాగే నిరుపేదలకి లోకాదాలత్ ద్వారా ఉచిత న్యాయ సహాయం న్యాయ సలహాలకు సహకరిస్తుంటారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన పెంచి వారు ఎదగడానికి కృషి చేస్తున్నారని తెలిపినారు అలాగే గిరిజన ప్రాంతాలను ప్రత్యేకంగా సందర్శించి వారిని చైతన్యపరిచి గిరిజన సంక్షేమ పథకాలు వారికి అందించడానికి నిరంతరం కృషి చేస్తూ ఉంటారు గ్రంథాలయాలు యొక్క విశిష్టతపై విద్యార్థులకు యువతకు అవగాహన పెంచుతూ వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని కోరుతూ వారిని చైతన్య పరుస్తూ ఉంటారు అని తెలియజేసినారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ శాఖ అధికారి సునీత పర్యవేక్షణలో విద్యార్థులు చదువరులు కలిసి ఘనంగా సత్కరించారు.

బిజెపి ఘన విజయంపై మనుబోలు నేతల హర్షం

విశాలాంధ్ర –మనుబోలు: మహారాష్ట్రలో బిజెపి ఘన విజయం సాధించడం పై మనుబోలు మండల బిజెపి నేతలు బొలా శీను, రామిరెడ్డి, కృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. బిజెపి దేశంలో హవా నడుస్తుందన్నారు. మహారాష్ట్రలో బిజెపికి భారీ విజయం జార?ండ్ సింగల్ అతిపెద్ద పార్టీ బిజెపి అవతరించింది. అలాగే ఉప ఎన్నికల్లో ఉత్తరకాండలో ఉత్తరప్రదేశ్ బెంగాల్లో బిజెపి కొనసాగుతుందని, నరేంద్ర మోడీ మన దేశంలో తిరుగులేదని మరోసారి నిరూపించారు.

ఉదయగిరి నియోజకవర్గాన్ని ఆదుకోండి: ఎమ్మెల్యే కాకర్ల

వెనకబడిన మెట్ట ప్రాంతమైన ఉదయగిరికి జిల్లా పరిషత్ నుండి ప్రత్యేక బడ్జెట్ కేటాయించండి

విశాలాంధ్ర -ఉదయగిరి: గత 40 సంవత్సరాలుగా ఉదయగిరి నియోజకవర్గం వివక్షకు గురైందని, జిల్లా పరిషత్ బడ్జెట్లో వెనకబడిన మెట్ట ప్రాంతమైన నియోజకవర్గానికి అత్యధిక నిధులు కేటాయించి ఆదుకోవాలని, శనివారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో స్థానిక శాసనసభ్యులు కాకర్ల సురేష్ గళం ఎత్తారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ యంత్రాంగం నిద్ర వ్యవస్థలో ఉందని, ఇప్పుడిప్పుడే గాడిలో పడుతుందన్నారు. గత ప్రభుత్వంలో అన్ని శాఖలను నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో పంచాయితీ అభివృద్ధికి బడ్జెట్లో అత్యధిక నిధులు కేటాయిం చారన్నారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ యువత ఉద్యోగ భద్రత కోసం కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా మండల పరిషత్ అధికారులు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, నిద్రను వీడి, పంచాయతీ అభివృద్ధిని పరుగులు పెట్టించాలని పేర్కొన్నారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో త్రాగునీటి సమస్య, అధికంగా ఉందని, తెలిపారు. జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కొలాయి సోమశిల జలాల నుండి తీసుకువచ్చేందుకు, రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ ప్రాజెక్టుకు సమయం పడుతున్నందున, ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా మినరల్ వాటర్ ను అందించేందుకు కృషి చేయాలన్నారు. మండల పరిషత్ పంచాయతీలలో అధికారులు సిబ్బంది కొరత లేకుండా చూడాలన్నారు. జిల్లా మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ జిల్లా చైర్ పర్సన్ ఆనం అరుణమ్మలు ఉదయగిరి నియోజవర్గంపై ప్రత్యేక దృష్టి సాధించాలని జిల్లా పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే కాకర్లసురేష్ తమ వాణి వినిపించారు.

మాలకొండ మాల్యాద్రిస్వామి సేవలో పొన్నూరు ఎమ్మెల్యే

విశాలాంధ్ర- వలేటివారిపాలెం: మాల కొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థా నంను పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ళ నరేంద్ర దంపతులు శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపకమీషనర్, ఆలయ కార్య నిర్వాహనాధికారి కె. వి.సాగర్ బాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి, అమ్మవారి దర్శనం చేయిం చారు. ఆలయ అధికారితో భక్తులకు అందుతున్న సౌకర్యాలు, ఏర్పాట్లు మరియు దేవస్థా నం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటే శ్వర్లు,వలేటివారిపాలెం ఎస్ ఐ. మరిడి నాయుడు, వలేటివారిపాలెం తెలుగుదేశం పార్టీ మండలఅధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, కాకుమాని హర్ష కుమార్ పాల్గొన్నారు.

అన్నదానానికి బియ్యం అందజేత

విశాలాంధ్ర- వలేటి వారిపాలెం: పవిత్ర పుణ్యక్షేత్రం అయిన మాల కొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధి, మాలకొండలో జరుగు తున్న అన్నదాన కార్యక్ర మానికి లింగసముద్రం మండలం లింగసముద్రం పంచాయితీ పరిధిలోని రామకృష్ణాపురం గ్రామం నుండి 85 బస్తాలు (26కేజీలు బస్తా) బియ్యం అందజేయడం జరిగింది. శనివారం ఈ బియ్యంను వాహనంలో మాలకొండకు తీసుకువెళ్లి డిప్యూటీ కమిషనర్ కెవి.సాగర్ బాబుకి అందజేశారు. వరుసగా మూడవ సంవత్సరం గ్రామంతో పాటు ఇతరులు నుండి సేకరించిన బియ్యం అన్నదానానికి ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ కెవి సాగర్ బాబు మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుండి అన్నదాన కార్యక్రమానికి బియ్యాన్ని సేకరించి ఇవ్వడం అభినందనీయమని గ్రామస్తులకు అభినందనలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ బి.వెంకటేశ్వరరావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరద నీటితో రామాపురం

విశాలాంధ్ర-బిట్రగుంట: బోగోలు మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని రామాపురం గిరిజనకాలనీ వర్షపు నీటితో నిండి ఉంది. కాలనీకి ఇరువైపులా ప్రైవేటు గుత్తేదారులు వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు వీలు లేకుండా ఎత్తుగా మట్టితోలి, లేఅవుట్లు నిర్మించడంతో కాలనీలోని వర్షపు నీరు బయటకువెళ్లేందుకు మార్గంలేక అక్కడే నిలిచి పోయింది. రోడ్డుకు ఆనుకుని కళ్ళముందు సమస్య కనిపిస్తున్నప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోక పోవడంతో కాలనీకి వెళ్లేందుకు నీళ్లలో దిగి వెళ్ళవలసి వస్తుంది. కాలనీలో రోడ్డు నిర్మాణానికై పలుమార్లు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులకు మొర పెట్టుకున్నప్పటికీ, నాయకుల మెహర్బానీకి వేసిన చోటే రోడ్లు వేస్తున్నారు తప్ప అవసరమైన చోట వేయడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

బాంబే బ్లడ్ గ్రూప్ ప్లేట్‌లెట్స్ డొనేట్ చేసిన ప్రదీప్

విశాలాంధ్ర- కొండాపురం: సాయిపేట గ్రామానికి చెందిన వ్యక్తి డెంగ్యూ కారణంగా నెల్లూరు నారాయణ హాస్పిటల్ లో చేరారు. ప్లేట్ లెట్స్ కౌంట్ తగ్గటంతో శాంపిల్ పరీక్షించగా 10 లక్షల మందిలో ఒకరికి ఉండే బాంబే బ్లడ్ గ్రూప్‌గా నిర్ధారణ అయ్యింది. ఆ పేషెంట్ కుటుంబ సభ్యులు లైఫ్‌లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తాటి కొండ నవీన్‌ని సంప్రదించారు. ఈ సమాచారం తెలుసుకున్న వెంటనే నవీన్ బాంబేబ్లడ్ గ్రూప్ దాతల సమాచారం కోసం ప్రయత్నించారు. ఇది చాలా అరుదైన బ్లడ్ గ్రూప్ కావటంతో నెల్లూరు జిల్లాలో బొంబాయి బ్లడ్ గ్రూప్ రక్తదాతలు అంధు బాటులోకి రాలేదు. చెన్నైలోని బొంబాయి బ్లడ్ గ్రూప్ దాత జగదీష్‌కి ఫోన్ చేసి డెంగ్యూ పేషెంట్ కి అత్యవసరంగా బాంబేబ్లడ్ గ్రూప్ ప్లేట్‌లెట్స్ కావాలని తెలిపిన వెంటనే జగదీష్ స్పందించి ఆఫీస్ సెలవు తీసుకొని చెన్నై నుండి నెల్లూరు వచ్చారు. ఆసుపత్రిలో అడ్మిటైన వ్యక్తికి ప్లేట్‌లెట్స్ దానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా బ్లడ్ అరేంజ్ చేసినందుకు తాటికొండ నవీన్ కి మరియు బాంబే బ్లడ్ గ్రూప్ డోనర్ జగదీష్ కి రక్తదాత పేషెంట్ బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. తన విలువైన సమయాన్ని వెచ్చించి చెన్నై నుంచి నెల్లూరు వచ్చిన ప్రాణదాత జగదీష్‌కు ఫౌండేషన్ వారు కృతజ్ఞతలు తెలిపారు

కాంగ్రెస్ గెలుపు సంబరాలు

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: వయనాడు ఎంపీగా ప్రియాంక గాంధీ, జార్ఖండ్ అసెంబ్లీ ఎలక్షన్లో కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించిందని నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్ రెడ్డి తెలిపారు. విజయానికి గుర్తుగా స్థానిక ఇందిరాభవన్ లో నాయకులు కార్యకర్తలు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం బాణాసంచా కాల్చారు. నాలుగు లక్షల పైగా వయనాడు నియోజకవర్గంలో ప్రియాంక గాంధీకి బ్రహ్మరథం పట్టారని, జార్ఖండ్ రాష్ట్రంలో సంపూర్తిగా కాంగ్రెస్ ఆహ్వానించారని, మహారాష్ట్ర ఎన్నికల్లో అనేక అక్రమాలకు బీజేపీ కూటమి పాల్పడినదని, రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దేశమంతటా విజయ దుందుభి మోగిస్తుందని, న్యాయవంతమైన పాలన దేశంలో రాహుల్ గాంధీ సారథ్యంలో కాంగ్రెస్ తోనే సాధ్యమని అన్నారుకార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ ఇంచార్జ్ ఏటూరి శ్రీనివాసులు రెడ్డి, పిసిసి మెంబర్ బాల సుధాకర్, మీడియా ఇంచార్జ్ అడ్వకేట్ కే సంజయ్ కుమార్. అల్లావుద్దీన్, గణేష్,మల్లికార్జున రెడ్డి, షేక్ హుస్సేన్ భాష, ఇర్ఫాన్, రాజా ఎన్ఎస్‌యుఐ, కిషోర్, ఆదినారాయణ అష్రాఫ్ హనీఫ్ ఆయూబ్ ఖాన్ రిజ్వానా, భాను దాసు రహమతుల్లా మస్తాన్ రాజేష్ బబ్బి శ్రీను నరేంద్ర తదితరులు పాల్గొన్నారు

ఘనంగా బి ఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల
కాలేజ్ ఫెస్టివల్

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : కందుకూరు పట్టణంలోని మాచవరం లో ఉన్న బిబి.ఆర్ ఆక్స్ ఫర్డ్ ఐఐటి మెడికల్ అకాడమీ,జూనియర్ కాలేజ్‌లి ఎంసెట్ క్యాంపస్ నందు శనివారం కాలేజ్ ఫెస్టివల్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా కందుకూరు డిఎస్పీ సుబ్రహ్మణ్యం పాల్గొని విద్యార్థినీ, విద్యార్థులకు వారి విలువైన సలహాలు సూచనలు తెలియజేశారు. విద్యార్థినీ, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అలాగే ఈ కార్యక్ర మంలో ప్రముఖ టీవీ షో జబర్దస్త్‌లో పేరు ప్రఖ్యాతలు పొందిన గడ్డం నవీన్, వినోద్ లు పాల్గొని వారి స్కిట్లులతో అలరించారు. ఈ సందర్భంగా బి.ఆర్ ఆక్స్ ఫర్డ్‌లి విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర రావు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రమశి క్షణ, మానసిక ఉల్లాసం ఎంతో అవసరమని దానికి తగ్గట్టుగా లిఆక్స్ఫర్డ్ విద్యాసంస్థలలి యాజమాన్యం ఎప్పుడూ కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఆక్స్ ఫర్డ్‌లి విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి బాల భాస్కర రావు,బి.నరేంద్ర బాబు,డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు, ఇంటర్ కాలేజ్ ప్రిన్సిపాల్స్ షేక్. షావుల్ హమీద్, ఇర్ఫాన్,కనిగిరి కాలేజ్ బ్రాంచ్ డైరెక్టర్ పి.రాంబాబు,కనిగిరి స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్,కందుకూరు స్కూల్ బ్రాంచ్ డీన్ రామారావు, ప్రిన్సిపాల్స్ నజీర్, మల్లికార్జున మరియు తదితర పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది,డిగ్రీ కాలేజీ ఉపాధ్యాయ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే
ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ప్రతి ఇంటిలో ఉన్న పాత కరెంటు మీటర్ స్థానంలో సిమ్ కార్డు అమర్చి ఉన్న విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ బిగించి ప్రజలపై తీవ్ర గుదిబండ మోపనున్నారు. సెల్ ఫోన్ రీఛార్జి చేసుకున్న మాదిరిగానే భవిష్యత్తులో కరెంటు రీఛార్జ్ చేసుకునే పరిస్థితి తీసుకురాబోతున్నారు. రైతులు, పేదలు, సామాజికంగా వెనుకబడిన తరగతులు, చిన్న తరహా పరిశ్రమలు అందరూ కూడా దివాలా తీసే పరిస్థితి దీనివల్ల ఏర్పడుతుంది. ట్రూ అప్ చార్జీల పేరుతో 17 వేల కోట్లకు పైగా డిసెంబర్ 2024 నుండి కూటమి ప్రభుత్వం అదనపు భారాన్ని మోపనుంది. భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారంసిపిఎం నెల్లూరు నగర కమిటీ కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు నగర కార్యదర్శి వర్గ సభ్యులు జీ నాగేశ్వరరావులు మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ రంగాన్ని ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే చర్యలను వేగవంతం చేశారని అన్నారు. విద్యుత్ రంగంలో ఉత్పత్తిలో ఉన్న ప్రైవేటీకరణను అన్ని విభాగాలలోనూ పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని అన్నారు. దానిలో భాగంగానే గత ప్రభుత్వం తలపెట్టిన ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగింపు చర్యలను కూటమి ప్రభుత్వం వేగవంతం చేస్తున్నదని అన్నారు. అదానీ కంపెనీకి చెందిన సిమ్ కార్డ్ అమర్చినటువంటి ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను ప్రతి ఇంటిలో పాత మీటర్ స్థానంలో బిగించేందుకు చర్యలు ప్రారంభించారని అన్నారు. దీనివల్ల విద్యుత్ రంగం యావత్తు కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లే చర్యలు పూర్తవుతాయని అన్నారు. టెలికం రంగంలో బిఎస్ఎన్ఎల్ ని ఏ విధంగా నిర్వీర్యం చేశారో అదే తరహాలో విద్యుత్ రంగాన్ని చేసేందుకు ఈ చర్యలు చేపట్టారని అన్నారు. సెల్ ఫోన్ రీఛార్జి చేసుకున్న మాదిరిగానే భవిష్యత్తులో కరెంటు బిల్లులు కూడా రీఛార్జి చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. ప్రభుత్వ నియంత్రణ,పర్యవేక్షణ లేకుండానే చార్జీలు భారీగా పెరిగిపోతాయని అన్నారు. అదాని కంపెనీకి చెందిన ఈ మీటర్లు ప్రజలందరూ ఉమ్మడిగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ట్రూ అప్ చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు ట్రూ అప్ చార్జీలకు వ్యతిరేకంగా సిపిఎం వామపక్షాలు మరో విద్యుత్తు ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నాయని ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి. సూర్య నారాయణ, కాయన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.